సాక్షి ఆదిలాబాద్

ఆదివారం । 14 । జూలై । 2024



వినూత్న ఆలోచన.. 8లో▸

'ఇన్నోవేషన్ ఇన్‌స్పైర్ మనాక్' అవార్డుల కోసం ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. 6–10 తరగతుల విద్యార్థులు సెప్టెంబర్ 15 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తోంది.



సుందరీకరణపై పట్టింపేది?

జిల్లా కేంద్రంలో చేపట్టిన సుందరీకరణ పనులు ఏళ్లు గడుస్తున్నా పూర్తి కావడంలేదు. దీంతో పట్టణ ప్రజలు అసౌకర్యానికి గురవుతూ ఆహ్లాదానికి దూరమవుతున్నారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 29.0/25.0

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణం చల్లబడుతుంది. అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డికి సన్మానం



శివసేనారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా శనివారం బాధ్యతలు స్వీకరించిన శివసేనారెడ్డిని జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. జిల్లాలోని క్రీడాకారులకు ప్రోత్సాహం అందించాలని కోరారు. యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్‌గౌడ్, ఆదిలాబాద్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సామ రూపేశ్‌రెడ్డి, బోథ్ నియోజకవర్గ అధ్యక్షుడు పోతారెడ్డి తదితరులున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేయాలి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

ఇంద్రవెల్లి: సీజనల్ వ్యాధులు ప్రబలనున్న నేపథ్యంలో గ్రామీణ ప్రజలను అప్రమత్తంగా చేయాలని డీఎంహెచ్‌వో నరేందర్‌రాథోడ్ సూచించారు. శనివారం మండలంలోని దనోరా (బీ) ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించారు. సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య వివరాలు, ప్రతీ శుక్ర, మంగళవారాల్లో నిర్వహించే డ్రైవ్ డే కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. చిత్తబట్ట గ్రామానికి చెందిన గర్భిణి పంద్ర శ్రీదేవి గ్రామం నుంచి కాలినడకన ఆస్పత్రికి వెళ్లడానికి గల కారణాలు తెలుసుకుని, ఇలాంటి సందర్భాల్లో తప్పకుండా అంబులెన్స్ సేవలు ఉపయోగించాలని సూచించారు. మాజీ సర్పంచ్ కోవ లాల్‌షావ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కోవ రాజేశ్వర్, హెల్త్ అసిస్టెంట్ వినోద్, సిబ్బంది తిరుపతమ్మ తదితరులున్నారు.

రిమ్స్ వైద్యుడికి అవార్డు



అరుణ్‌కుమార్‌ను అభినందిస్తున్న వైద్యులు

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆస్పత్రి పాథాలజీలో పోస్టు గ్రాడ్యుయేట్ చేస్తున్న వైద్యుడు అరుణ్‌కుమార్ మెడికల్ ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్స్ విభాగంలో జాతీయస్థాయి అవార్డు అందుకున్నారు. 2024లో ఈ అవార్డు కోసం దేశ వ్యాప్తంగా 124 నామినేషన్లు రాగా ఆయన ఎంపికయ్యారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఇటీవల రాజస్థాన్‌లోని జైపూర్‌లోగల ఇల్బాన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అరుణ్‌కుమార్‌కు అక్కడి వైద్యారోగ్యశాఖ మంత్రి అవార్డు అందజేశారు. శనివారం రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, వైద్యులు తిప్పస్వామి, శ్యాంప్రసాద్ ఆయనను అభినందించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న దామెర కిరణ్

ఎదులాపురం: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి దామెర కిరణ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండు రోజులుగా జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థలను ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విజిట్ చేశామని చెప్పారు. సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కారం కాలేదని, వార్డెన్లు సమయపాలన పాటించడం లేదని ఆరోపించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందడంలేదని తెలిపారు. 'మన ఊరు–మన బడి' స్కీంకు నిధులు రాక సమస్యలు పరిష్కారం కావడంలేదని పేర్కొన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే సమరశీల పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. నాయకులు అభినందన్, శుభం, పవన్, మహేందర్, అక్షిత్, గోపాల్, నగేశ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

రథయాత్రకు హాజరైన భక్తులు



కృష్ణుడు, రామలక్ష్మణుల వేషధారణలో చిన్నారులు



నృత్యం చేస్తున్న యువతులు



జయము జయము జగన్నాథా..

జిల్లా కేంద్రంలో శనివారం ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. 'జయహో జగన్నాథా..' నామస్మరణతో పురవీధులు మార్మోగాయి. ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూరి జగన్నాథుని రథయాత్ర నేత్రపర్వంగా సాగింది. సోదరుడు బలబద్ర, సోదరి సుభద్రతో కలిసి కొలువుదీరిన జగన్నాథుని రథాన్ని లాగడానికి భక్తజనం పోటీ పడ్డారు. జిల్లా కేంద్రంలోని స్థానిక మధుర జిన్నింగ్ నుంచి ప్రారంభమైన రథయాత్ర అంబేద్కర్‌చౌక్, గాంధీచౌక్, అశోక్ రోడ్డు, గోపాలకృష్ణ మఠం, నేతాజీచౌక్ మీదుగా కొనసాగింది. మహిళలు కలశాలతో రథం ముందు నృత్యం చేశారు. చిన్నారులు, భక్తులు భజన, సంకీర్తనలు చేయగా, యువతులు లయబద్ధంగా నృత్యం చేస్తూ ఆకట్టుకున్నారు. 'హరే రామ.. హరే కృష్ణ.. జై జగన్నాథా..' అంటూ రథంపై పూలు చల్లి జగన్నాథున్ని స్మరించుకున్నారు. ఇస్కాన్ ప్రతినిధులు భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. రథయాత్ర ముగిసిన అనంతరం పూరి జగన్నాథుని కథా శ్రవణంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

– ఆదిలాబాద్

జలకళను సంతరించుకున్న మత్తడి వాగు



వర్షం.. సాధారణం

- 357.3 మిల్లీ మీటర్లుగా నమోదు
- నేరడిగొండలో వర్షాభావ పరిస్థితి
- మిగతా మండలాల్లో మంచి వర్షం
- నిండుతున్న ప్రాజెక్టులు, చెరువులు
- పెరుగుతున్న భూగర్భ జలమట్టం

జూన్ 1 నుంచి జూలై 13 వరకు..

సాధారణం	321.8 మి.మీ.లు
కురిసింది	357.3 మి.మీ.లు
వ్యత్యాసం	11 శాతం అధికం
స్థితి	సాధారణం

మండలాల వారీగా వర్షపాతం ఇలా..

మండలం	సాధారణం (మి.మీ)	కురిసింది (మి.మీ)	స్థితి
భీంపూర్	282.1	321.0	సాధారణం
జైనథ్	333.8	376.5	సాధారణం
బేల	316.6	344.1	సాధారణం
గాదిగూడ	314.0	307.2	సాధారణం
నార్నూర్	324.9	276.2	సాధారణం
ఇంద్రవెల్లి	355.5	325.7	సాధారణం
గుడిహత్నూర్	308.4	376.4	అధిక వర్షం
ఆదిలాబాద్‌రూరల్	327.6	482.7	అధిక వర్షం
ఆదిలాబాద్‌అర్బన్	331.5	480.1	అధిక వర్షం
మావల	323.6	294.0	సాధారణం
తాంసి	304.8	431.0	అధిక వర్షం
తలమడుగు	317.6	346.7	సాధారణం
బజార్‌హత్నూర్	325.6	353.9	సాధారణం
బోథ్	307.9	273.3	సాధారణం
నేరడిగొండ	310.4	238.3	లోటు వర్షం
ఇచ్చోడ	322.1	331.5	సాధారణం
సిరికొండ	339.6	397.0	సాధారణం
ఉట్నూర్	346.3	472.0	అధిక వర్షం

సాక్షి, ఆదిలాబాద్: ఈ వానాకాలం మొదలైన తర్వాత జిల్లాలో ఇప్పటివరకు సాధారణ వర్షపాతమే నమోదైంది. జూన్ మొదటి మూడు వారాలు వర్షాభావ పరిస్థితులు తలెత్తాయి. ఆ తర్వాత కుదుటపడి జిల్లాలోని పలు మండలాల్లో మంచి వర్షాలే కురిశాయి. ఒక్క నేరడిగొండ మండలంలో వర్షాభావ పరిస్థితులు ఉండగా, మిగతా మండలాల్లో సాధారణం, అధిక వర్షపాతం నమోదైంది.

క్రమంగా నిండుతున్న జలాశయాలు

జిల్లాలో ఇప్పటివరకు కురిసిన సాధారణ వర్షపాతానికి జలాశయాలు మెల్లగా నిండుతున్నాయి. జైనథ్ మండలంలోని సాత్నాల, తాంసి మండలం వడ్డాడిలోని మత్తడివాగు ప్రాజెక్టులకు క్రమంగా నీటి మట్టం పెరుగుతూ వస్తోంది. జిల్లాలో 392 చెరువులుండగా చాలా వాటిలో 50 శాతం వరకు నీరు చేరింది. కాగా, జిల్లా సరిహద్దు నుంచి పారే పెన్‌గంగ, నేరడిగొండ మండలంలోని కుప్టి వంతెన వద్ద ప్రతీ ఏడాది ఎగువన కురిసే భారీ వర్షాలకు వరద వస్తోంది. తాజాగా భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతానికైతే ఈ రెండు చోట్ల మామూలు వరదలే ఉన్నాయి. కాగా, జిల్లాలో భూగర్భ జలాలు క్రమక్రమంగా పెరుగుతున్నాయి.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో 18 మండలాలుండగా 12 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. ఐదు మండలాల్లో అధిక వర్షపాతం చోటు చేసుకుంది. ఒకే ఒక నేరడిగొండ మండలంలో మాత్రం వర్షాభావ పరిస్థితి ఉంది. జిల్లాలో ఇప్పటివరకు సగటున 357 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

ప్రాజెక్టుల్లో నీటిమట్టం ఇలా..

జిల్లాలోని సాత్నాల ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 286.50 మీటర్లు కాగా, ప్రస్తుతం 281.20 మీటర్ల నీరుంది. దీని సామర్థ్యం 1.24 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 0.316 టీఎంసీలు ఉంది. మత్తడివాగు ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 277.50 మీటర్లు కాగా, ప్రస్తుతం 275.400 మీటర్ల నీరుంది. దీని సామర్థ్యం 0.571 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 0.341 టీఎంసీలున్నట్లు అధికారులు తెలిపారు.

విద్యాశాఖలో డెప్యూటేషన్ల లొల్లి

- పోస్టులకు సంఘాల రంగప్రవేశం
- తమవారికే ఇవ్వాలంటూ పట్టు
- మాల సంఘం నేతల నిరసన



నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: విద్యాశాఖలో స్పోర్ట్స్ స్కూల్‌కు సంబంధించి డెప్యూటేషన్ల లొల్లి జరుగుతోంది. పారదర్శకంగా పోస్టులను భర్తీ చేయాల్సిన అధికారులు, ఉద్యోగులు పైరవీకారులకు ప్రాధాన్యతనిస్తుండటం వివాదానికి దారి తీస్తోంది. రెండు రోజుల కిందట ఉపాధ్యాయ సంఘాల నాయకులతో డీఈవో నిర్వహించిన సమావేశం ఆందోళనకు దారి తీయగా, ఆదివారం కూడా డీఈవో కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. పలు సంఘాల నాయకులు తమ వారికే ఇవ్వాలంటూ పట్టుబట్టడంతో గందరగోళం నెలకొంది. రెండు వర్గాలుగా వీడిన సంఘాలు ఆధిపత్యం కోసం ఆరాటపడ్డట్లు కనిపించింది. అర్హులకు ఇవ్వాల్సిన డెప్యూటేషన్ సంఘాల జోక్యంతో ఎటూ తేలకుండా పోతోంది. బదిలీలు, ప్రమోషన్ల కారణంగా ఈ ప్రక్రియను తాత్కాలింగా వాయిదా వేసిన అధికారులు మళ్లీ ప్రారంభించారు. ఎవరి ప్రమేయం లేకుండా విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండి, ఎంఈవో, ప్రధానోపాధ్యాయుల నుంచి ఎన్వోసీ ఉన్న వారికి డెప్యూటేషన్ ఇస్తే ఎలాంటి లొల్లి జరిగేందుకు ఆస్కారం ఉండదనే అభిప్రాయం ఉపాధ్యాయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. పట్టుబట్టి కొన్ని సంఘాల నాయకులు అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో ఈ సమస్య తీవ్రమవుతోంది. అనర్హులకు డెప్యూటేషన్ కల్పించేలా కొన్ని సంఘాలు అధికారులపై ఒత్తిడి తెస్తుండటంతో, వారి మాటకే తలొగ్గాల్సిన పరిస్థితి తలెత్తింది. ఇలా చేయడం ద్వారా అర్హులకు అన్యాయం జరిగే అవకాశముంది. కాగా, తామంటే తాము అర్హులమంటూ అధికారులతో వాగ్వాదానికి దిగుతున్నారు. సంఘ బాధ్యులు, ప్రజాప్రతినిధులతో పైరవీలు చేయిస్తున్నారు. ఇలాంటి వారికి డీఈవో కూడా హామీ ఇస్తుండటం ఆందోళనకు కారణమవుతోంది. కాగా, ఫిజిక్స్ పోస్టు కోసం ఇద్దరు ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ పోస్టు కోసం రెండు సంఘాల నాయకులు పట్టుబడుతున్నారు. తమ వారికే ఇప్పించుకునేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నారు. ఎటూ తేలకపోవడంతో ప్రస్తుతం నాలుగు పోస్టులకు సంబంధించి డెప్యూటేషన్ ఆర్డర్లు జారీ చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. వివాదం ముగిశాక మిగతా పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

మాల సంఘం నిరసన

బేల మండలానికి చెందిన ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు భూమన్న డెప్యూటేషన్ కోసం ఈ నెల 3న డీఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారని మాల సంఘం నాయకులు తెలిపారు. ఆయన దరఖాస్తును ఇన్‌వార్డు, సంబంధిత సెక్షన్ ఉద్యోగి, విద్యాశాఖ అధికారులు మాయం చేశారని ఆరోపిస్తూ డీఈవో కార్యాలయం ఎదుట శనివారం నిరసన తెలిపారు. అనర్హులకు డెప్యూటేషన్ ఇస్తే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. దరఖాస్తును మాయం చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. కాగా, డీఈవోను కలవగా భూమన్నకు డెప్యూటేషన్ ఇచ్చేందుకు అంగీకరించినట్లు సంఘం నాయకులు పేర్కొన్నారు. నాయకులు శశికాంత్, సూర్యవరప్రసాద్, సత్యనారాయణ, సోగాల సుదర్శన్, ఊశన్న, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురికి స్పోర్ట్స్ స్కూల్‌లో..

జిల్లా కేంద్రంలోని స్పోర్ట్స్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న పోస్టుల కోసం డీఈవో ప్రణీత ఏడుగురు ఉపాధ్యాయులకు డెప్యూటేషన్‌పై విధులు కేటాయిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. నార్నూర్ జెడ్పీఎస్‌ఎస్‌లో గణితం బోధిస్తున్న ప్రేమ్‌సింగ్, బజార్‌హత్నూర్ పాఠశాలలో ఫిజికల్ సైన్స్ బోధిస్తున్న ఆర్.అంజలి, తలమడుగు జెడ్పీఎస్‌ఎస్‌లో ఫిజికల్ సైన్స్ బోధిస్తున్న ఎస్.అజయ్‌కుమార్, బేల జెడ్పీఎస్‌ఎస్‌లో ఇంగ్లిష్ బోధిస్తున్న ఏ భూమన్న, బేల మండలం కొగ్దూర్ జెడ్పీఎస్‌ఎస్‌లో ఇంగ్లిష్ బోధిస్తున్న సీహెచ్ మోహన్‌రెడ్డి, ఆదిలాబాద్ రూరల్ మండలం లోకారిలో తెలుగు బోధిస్తున్న భాస్కర్‌రెడ్డి, ఆదిలాబాద్‌రూరల్ మండలం కచ్‌కంటిలో ఎస్జీటీగా పని చేస్తున్న రమాదేవికి డెప్యూటేషన్ ఇచ్చారు. కాగా, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్‌లో ఒక్కో ఉపాధ్యాయుడినే నియమించాల్సి ఉండగా ఇద్దరేసి చొప్పున నియమించడం గమనార్హం. ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకుల ఒత్తిడి మేరకే ఈ రెండు సబ్జెక్టుల్లో అదనంగా ఒక్కొక్కరిని నియమించినట్లు తెలుస్తోంది.

'సర్కారుది నాన్చుడు ధోరణి'



మాట్లాడుతున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: రైతుభరోసాపై రైతుల అభిప్రాయ సేకరణ చేపట్టడం కాంగ్రెస్ సర్కారు నాన్చుడు ధోరణికి నిదర్శనమని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేస్తామని, రైతుభరోసా ఇస్తామన్న ప్రభుత్వం రైతుల అభిప్రాయాలు సేకరించడం ఎందుకని ప్రశ్నించారు. ఉట్నూర్‌లో తలుపులు వేసి రైతుల అభిప్రాయ సేకరణ చేపట్టారని ఆరోపించారు. వందరోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని నమ్మించి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి 200 రోజులు గడిచినా హామీలు నెరవేర్చడం లేదని విమర్శించారు. ఆయన వెంట నాయకులు రమేశ్, రాజు, మెట్టు ప్రహ్లాద్, వేణుగోపాల్ యాదవ్, ఇజ్జగిరి నారాయణ, సాజిదొద్దీన్, శ్రీనివాస్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఈఎంఆర్‌ఎస్ విద్యార్థినులకు కొనసాగుతున్న చికిత్స

- పట్టించుకోని ఉన్నతాధికారులు
- ఆందోళనలో తల్లిదండ్రులు



విద్యార్థినులకు చికిత్స అందిస్తున్న వైద్యులు

నార్నూర్: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాల (ఈఎంఆర్‌ఎస్) లో విద్యార్థినులు శ్వాసకోశ సమస్యతో బాధపడుతున్న విషయం తెలిసిందే. సుమారు 350 మంది చదువుతున్న ఈ పాఠశాలలో శుక్రవారం రాత్రి పలువురు శ్వాసకోశ సమస్యతో ఇబ్బందిపడ్డారు. విద్యార్థినులను ఉపాధ్యాయులు మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రి (సీహెచ్‌సీ)కి తరలించారు. వీరిలో ఐదుగురికి ఆక్సిజన్ అవసరం కాగా, ఆస్పత్రిలో సరిపడా లేదు. పూర్తిస్థాయిలో సిబ్బంది లేక సరైన వైద్యం అందడంలేదు. ప్రస్తుతం కొందరు ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. రెండురోజులుగా విద్యార్థినులు శ్వాసకోశ సమస్యతో బాధపడుతున్నా ఇప్పటివరకు వైద్యారోగ్యశాఖ అధికారులు, విద్యాశాఖ ఉన్నతాధికారులు పాఠశాలను సందర్శించలేదు. అధికారులకు సమాచారం ఇచ్చేందుకు ఫోన్ చేయగా వారు స్పందించడంలేదని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సందర్శించి తమ పిల్లలకు సరైన వైద్యం అందించాలని కోరుతున్నారు. కాగా, ప్రతీ ఏడాది వానాకాలం లేదా చలికాలంలో ఈ సమస్య తలెత్తుతోందని ప్రిన్సిపాల్ ఉపేందర్ తెలిపారు. బాలికలే ఈ సమస్యకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థినులు మానసిక భయాందోళనలో ఉన్నారని, మహిళా వైద్యులతో కౌన్సెలింగ్ ఇప్పించాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. ఈఎంఆర్‌ఎస్ సొసైటీ తరఫున కారణాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని, సమస్య తలెత్తిన వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లి వైద్యం అందిస్తున్నామని వివరించారు.

వృత్తివిద్య కోర్సుల్లో ఉచిత శిక్షణ



మాట్లాడుతున్న విహారికృష్ణ

ఎదులాపురం: రామానంద తీర్థ సంస్థ సౌజన్యంతో షిరిడీ సాయి సేవా సొసైటీ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు వృత్తివిద్య కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రామానంద తీర్థ సంస్థ ప్రతినిధి విహారికృష్ణ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పదో తరగతి, ఇంటర్ ఉత్తీర్ణులైన 18 ఏళ్లు నిండిన యువతీయువకులకు వసతి, భోజనంతో కూడిన ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కంప్యూటర్, అకౌంటింగ్, టాలీ, టైలరింగ్, ఎలక్ట్రికల్, సోలార్, ఆటో మొబైల్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్, కంప్యూటర్ అండ్ మొబైల్ హార్డ్‌వేర్ తదితర అంశాల్లో మూడు నుంచి ఆరు నెలలు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం ఉపాధి కల్పిస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9949459592, 9490675675 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. సొసైటీ బాధ్యులు ప్రశాంత్‌రెడ్డి, దశరథ్, వినోద్, శివన్న, రాజు, అశోక్, దినేశ్ తదితరులున్నారు.

అధికారులతో కలెక్టర్ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: ప్రజాపాలన, ధరణి, వ్యవసాయం, వైద్యం, వన మహోత్సవం, మహిళాశక్తి, విద్య, యాంటీడ్రగ్స్, లా అండ్ ఆర్డర్స్ తదితర అంశాలపై కలెక్టర్ రాజర్షి షా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల వారీగా వివరాలు, పురోగతి తెలుసుకున్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, రిమ్స్ డైరెక్టర్, వైద్యాధికారి, విద్యాధికారి, సివిల్ సప్లయ్, హార్టికల్చర్ అధికారులు, ప్రిన్సిపాల్‌లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వివాహితను కాపాడిన బ్లూకోల్ట్స్ సిబ్బంది

నిర్మల్‌టౌన్: ఆత్మహత్యకు యత్నించిన వివాహితను బూకోల్ట్స్ సిబ్బంది కాపాడారు. పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. కర్ణాటకలోని బీదర్‌కు చెందిన ఓ మహిళ భర్త ఏడాది క్రితం మృతిచెందాడు. ఆమెకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఖానాపూర్‌లో నివసించే వెంకటేశ్‌తో ఇన్‌స్టాగ్రాంలో పరిచయం ఏర్పడి పెళ్లి చేసుకున్నారు. నిర్మల్‌లో నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో కుటుంబ కలహాలతో వివాహిత మనస్తాపం చెందింది. శనివారం బంగాల్‌పేట్‌చెరువు వద్దకు చేరుకుంది. స్థానికులు గమనించి బూకోల్ట్స్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని ఆమెను రక్షించి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వివాహిత కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, బూకోల్ట్స్ సిబ్బందిని డీఎస్పీ గంగారెడ్డి అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


గంగయ్య (ఫైల్)

సోన్: పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఏఎస్సై భూమేశ్వర్ కథనం ప్రకారం..బోథ్ మండలం కరత్వాడా గ్రామానికి చెందిన పూజారి గంగయ్య (27) సోన్ మండలం పాక్‌పట్ల గ్రామంలో 8 ఏళ్లుగా భార్య కొడుకుతో ఉంటున్నాడు. అక్కడే చిన్న చిన్న పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. భార్య అనారోగ్యంతో తల్లిగారి ఇంటి వద్దనే ఉంటుంది. పలుమార్లు వెళ్లి పిలిచినా రావడం లేదని గంగయ్య మనస్తాపం చెంది ఈనెల 11న పురుగుల మందు తాగాడు. నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్సపొందుతూ శనివారం మృతిచెందాడు. భార్య రేణుక ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

పురుగుల మందుతాగి ఆత్మహత్య


నరేశ్ (ఫైల్)

కడెం: మండలంలోని పెద్దబెల్లాల్ గ్రామానికి చెందిన తుప్ప నరేశ్ (39) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ఎం.కృష్ణసాగర్‌రెడ్డి కథనం ప్రకారం..నరేశ్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఎంతకీ నయం కాకపోవడంతో తీవ్ర మనస్తాపం చెంది శనివారం ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు నిర్మల్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించి శనివారం మృతిచెందాడు. భార్య రజిత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

యువకుడి అదృశ్యం

ఎదులాపురం: పట్టణంలోని చిల్కూరినగర్‌కు చెందిన యువకుడు నవీద్ బేగ్ అదృశ్యమైనట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..నవీద్ బేగ్ పీవోపీ వర్క్ చేస్తుంటాడు. ఈనెల 7న ఉదయం 10 గంటకు పనికి వెళ్తున్నానని చెప్పి బయల్దేరాడు. 8, 9 తేదీల్లో ఆసిఫాబాద్‌లో వర్క్ చేస్తున్నానని తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పాడు. మరుసటి రోజు నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో తండ్రి హైమద్ బేగ్ శనివారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బైక్ చోరీ

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని 170 కాలనీకి చెందిన గేడం గణేశ్ బైక్ శుక్రవారం రాత్రి చోరీకి గురైంది. ఎస్సై విష్ణువర్ధన్ కథనం ప్రకారం.. గణేశ్ ఇంటి బయట బైక్ పార్కింగ్ చేశాడు. శనివారం ఉదయం కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వినూత్న ఆలోచన.. విభిన్న ఆవిష్కరణ

- 'ఇన్‌స్పైర్ మనాక్'పోటీలకు దరఖాస్తులు
- సెప్టెంబర్ 15 తేదీవరకు గడువు
- 6 నుంచి పదో తరగతి విద్యార్థులు అర్హులు

నిర్మల్ జిల్లాలో వివరాలు
ప్రభుత్వ ప్రాథోన్నత: 85
ప్రభుత్వ ఉన్నత: 107
ప్రైవేటు పాఠశాలలు: 192
ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు: 68,570
ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు: 45,200


రాష్ట్రస్థాయి విజ్ఞానమేళాలో ఆవిష్కరణను ప్రదర్శిస్తున్న విద్యార్థులు (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: వినూత్న ఆలోచనలతో పాఠశాల స్థాయి నుంచే సృజనాత్మక ఆలోచనలు చేసేలా విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 'ఇన్నోవేషన్ ఇన్‌స్పైర్ మనాక్'అవార్డు పోటీల పేరిట దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్, రాష్ట్ర సాంకేతిక మండలి(ఎస్‌సీఈఆర్టీ) సహకారంతో దీన్ని రూపొందించింది. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ ప్రతీఏటా నిర్వహిస్తోంది. 2024–25 విద్యా సంవత్సరానికి 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు ఈ పోటీలకు అర్హులు. తరగతికి ఒకటి చొప్పున పాఠశాలకు ఐదు, ప్రాథమికోన్నత పాఠశాలలకు మూడు ప్రాజెక్టులు పంపవచ్చు. ఈనెల 1 నుంచి ప్రారంభమైన ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ సెప్టెంబర్ 15వ తేదీ వరకు గడువు ఉంది.

దరఖాస్తు ఇలా..

విద్యార్థుల ఆవిష్కరణ ప్రాజెక్టులు, విద్యార్థి పేరు, తండ్రి పేరు, తరగతి వివరాల www.inspireawards-dst.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. విద్యార్థి బ్యాంకు ఖాతా, ఆధార్ నంబర్, ప్రాజెక్టు సంక్షిప్తంగా, రాత పూర్వకంగా పొందుపర్చి, సంబంధిత రైటప్‌ను వెబ్‌సైట్‌లో ఎంటర్ చేయాలి. ప్రాజెక్టు పేరు, శాస్త్ర సాంకేతికతకు సంబంధించిన అంశాలు ఉండేలా చూసుకోవాలి. ప్రాజెక్టుల ఎంపిక రెండు నెలల్లో పూర్తి చేసి జిల్లాస్థాయిలో ప్రకటిస్తారు. తర్వాత వాటిని రాష్ట్రస్థాయికి ఎంపికకు పంపిస్తారు. ఎంపికైన ప్రాజెక్టుకు ప్రయోగనిమిత్తం బ్యాంకు ఖాతాలో రూ.10 వేలు జమ చేస్తారు.

- జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో నమూనా ప్రాజెక్టు ప్రదర్శించేందుకు వీలుగా రూ.10 వేల పారితోషికం ఇస్తారు.
- రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రాజెక్టులకు సంబంధించి విద్యార్థుల ప్రతిభ సామర్థ్యం చూపి జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన బాల శాస్త్రవేత్తలకు రూ.25 వేల వరకు శాస్త్ర సాంకేతిక శాఖ అదనపు నిధులు కేటాయిస్తుంది.
- ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రాష్ట్రపతి భవన్, జపాన్ సందర్శన అవకాశాలతోపాటు ఇంజినీరింగ్ కళాశాల విద్యలో మెరుగైన అవకాశాలు లభిస్తాయి. జాతీయస్థాయికి ఎంపికైన ప్రాజెక్టుకు పేటెంట్ లభించే అవకాశం ఉంది.

నామినేషన్ ప్రక్రియపై అవగాహన

ఉమ్మడి జిల్లాలోని హెచ్ఎంలు, గైడ్ టీచర్లు, సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఇన్స్పైర్ అవార్డుల నామినేషన్ ప్రక్రియపై రాష్ట్రస్థాయి టీ–శాట్ బృందం ఇటీవల అవగాహన కల్పించింది. డిజిటల్ తెరలపై అవగాహన సదస్సు అంశాలను వీక్షించారు. ఎస్సీఈఆర్టీ అధికారుల ఆదేశాలతో డీఈవో రవీందర్‌రెడ్డి, ఇన్‌స్పైర్ మనాక్ అవార్డులో నామినేషన్లు అధికంగా వచ్చేలా చైతన్యవంతుల్ని చేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థుల మేధస్సుకు పదునపెట్టే సృజనాత్మక ఆలోచనలు పెంపొందించేందుకు ఈ కార్యక్రమం తోడ్పడుతుంది. విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తూ ఆవిష్కరణపై అవగాహన కల్పించాలి. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రతిభ కనబర్చేందుకు మంచి అవకాశం. ఇప్పటికే నామినేషన్ల కోసం దరఖాస్తుల ప్రక్రియ మొదలైంది. జిల్లాలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– వినోద్ కుమార్, జిల్లా సైన్స్ అధికారి

హెచ్ఐవీ టెస్ట్ అక్కడే!

- ఉమ్మడి జిల్లాలో 5 'ఐసీటీసీ' కేంద్రాలు మూసివేత
- స్థానికుల ఒత్తిడితో ఖానాపూర్‌లో పునఃప్రారంభం
- చెన్నూర్‌లో కూడా తెరిపించాలని పలువురి డిమాండ్
- ఇబ్బంది పడుతున్న గర్భిణులు, అనుమానితులు



చెన్నూర్ ఏరియా ఆస్పత్రిలో మూసి ఉన్న ఐసీటీసీ కేంద్రం

చెన్నూర్: హేతుబద్ధీకరణ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఎయిడ్స్ పరీక్ష కేంద్రాలను మూసివేసింది. తొలి విడుతలో మంచిర్యాల జిల్లా చెన్నూర్ నియోజకవర్గంలోని చెన్నూర్, మందమర్రిలో గల ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్ ట్రెనింగ్ సెంటర్ (ఐసీటీసీ) కేంద్రాలు మూసివేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చెన్నూర్, మందమర్రి, ఆదిలాబాద్, ఖానాపూర్, ముధోల్‌లో కేంద్రాలు మూతపడ్డాయి. దీంతో హెచ్ఐవీ పరీక్షలకు అనుమానితులతోపాటు గర్భిణులు ఇబ్బంది పడుతున్నారు. స్థానికుల ఒత్తిడితో అధికారులు ఇటీవల ఖానాపూర్‌లోని కేంద్రాన్ని మాత్రమే పునఃప్రారంభించారు. మరో నాలుగు కేంద్రాలు తెరుచుకోలేదు. చెన్నూర్ ఆస్పత్రిలో కూడా ఐసీపీటీ సెంటర్ పునఃప్రారంభించాలని పలువురు పేర్కొంటున్నారు.

పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి

చెన్నూర్‌లోని 50 పడకల ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ కానుంది. 100 పడకల మాతాశిశు ఆస్పత్రి భవన నిర్మాణం జరుగుతోంది. వచ్చే ఏడాది వంద పడకల ఆస్పత్రి ప్రారంభం కానుంది. చెన్నూర్‌లో ఎయిడ్స్ పరీక్ష కేంద్రం లేకపోవడంతో చెన్నూర్‌తో పాటు కోటపల్లి, వేమనపల్లి మండలాల బాధితులు, అనుమానితులు మంచిర్యాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఎయిడ్స్ నిర్ధారణ తర్వాత ఏఆర్టీ సెంటర్ గోదావరిఖనికి వెళ్లాల్సిన దుస్థితి. గ్రామీణ ప్రాంతాలకు చెందిన రోగులు, అనుమానితులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా అక్కడికి వెళ్లడం లేదు. వ్యాధి నిర్ధారణ అయినవారు మూడు నెలలకోసారి మందులు తీసుకురావాల్సిన పరిస్థితి.

2007లో కేంద్రం ప్రారంభం

చెన్నూర్‌లో ఐసీటీసీ కేంద్రాన్ని 2007లో ప్రారంభించారు. అప్పటి నుంచి డిసెంబర్ 2023న కేంద్రాలను మూసివేశారు. 16 ఏళ్లలో చెన్నూర్ కేంద్రంలో 39,821 మందికి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 12,814 మంది గర్భిణులకు పరీక్షలు చేయగా 31 మందికి వ్యాధి నిర్ధారణ అయింది. 27,009 మందికి అనుమానిత స్త్రీ, పురుషుల్లో 341 మందికి హెచ్ఐవీ సోకింది. చెన్నూర్ ఐసీటీసీ పరిధిలో మొత్తం 372 మంది ఎయిడ్స్ రోగులు ఉన్నారు. వీరితో పాటు హెచ్ఐవీ, టీబీ లక్షణాలు ఉన్న 3413 మందికి పరీక్షలు చేశారు. ప్రస్తుతం చెన్నూర్‌లో ఈ పరీక్షలు అందుబాటులో లేక పోవడంతో మంచిర్యాలకు పరుగులు తీయాల్సి వస్తుంది.

గర్భిణులు గోస..

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసూతి కోసం వచ్చి గర్భిణులకు తప్పనిసరి ఎయిడ్స్ పరీక్షలు చేయాల్సి ఉంటుంది. చెన్నూర్‌లో పరీక్ష కేంద్రం లేకపోవడంతో మంచిర్యాలకు వెళ్లాల్సి రావడంతో గర్భిణులు గోసపడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఎయిడ్స్ రోగుల ఇబ్బందులను గుర్తించి చెన్నూర్‌లో మూసివేసిన ఎయిడ్స్ పరీక్ష కేంద్రాన్ని తిరిగి ప్రారంభించేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

'గిరిజన నాయకుడిని గౌరవించని మంత్రులు'


మాట్లాడుతున్న బానోత్ జగన్, తదితరులు

నార్నూర్: రెండుసార్లు ఖానాపూర్ ఎమ్మెల్యేగా, జెడ్పీ చైర్మన్‌గా, ఎంపీగా సేవలందించిన రాథోడ్ రమేశ్ అంత్యక్రియలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించకపోవడం గిరిజన నాయకుడిని అవమానించడమేనని లంబాడి జేఏసీ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ జగన్ అన్నారు. మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ సీనియర్ నేత డీఎస్ అంత్యక్రియలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి రాథోడ్‌కు నిర్వహించకపోవడం వివక్ష కాదా అని ప్రశ్నించారు. ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లో ఈనెల 11న చేపట్టిన రైతుల అభిప్రాయ సేకరణకు హాజరైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కూతవేటు దూరంలో పూలాజీబాబా పాఠశాలలో నిర్వహించిన పెద్దకర్మకు రాకపోవడం శోచనీయమన్నారు. రాథోడ్ రమేశ్‌కు నివాళిర్పించకపోవడం ఆయనపై మంత్రులకు గౌరవం లేదన్నారు. సమావేశంలో లంబాడి జేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడు నేతావత్ రాందాస్, ప్యాక్స్ చైర్మన్ ఆడే సురేష్, నాయకులు పవర్ దేవిదాస్, గణేశ్, భీంరావు, రామారావు, సంతోష్, రామ్ మహరాజ్, రాంజీ రాథోడ్, రమేశ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళ అప్పగింత


మహిళతో బ్లూకోల్ట్స్ పోలీసులు

జన్నారం: మతిస్థిమితం కోల్పోయి మండల కేంద్రంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న మహిళను పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. హెడ్‌కానిస్టేబుల్ లింగన్న, బ్లూకోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్ కథనం ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం దంతనపల్లి గ్రామానికి చెందిన రాజేశ్వరి మానసిక సమస్యతో ఇబ్బంది పడుతుంది. ఆస్పత్రిలో చికిత్స పొందింది. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లింది. కుటుంబసభ్యులు డ్యూటీకి వెళ్లిందని అనుకున్నారు. సాయంత్రం తిరిగి రాకపోవడంతో వెతికినా ఆచూకీ దొరకలేదు. శనివారం జన్నారం బస్టాండ్ ప్రాంతంలో అనుమానాస్పదంగా కనిపించింది. ఓ ఇంట్లో బాత్రూమ్‌లో ఉందని 100 డయల్‌కు సమాచారం అందింది. ఎస్సై రాజవర్ధన్ ఆదేశాలతో హోంగార్డు నరేందర్‌తో కలిసి హెడ్‌కానిస్టేబుల్, బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్..బస్టాండ్ ప్రాంతంలో మహిళను గుర్తించారు. ఆధార్‌కార్డు ఆధారంగా కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. సాయంత్రం బంధువులు రాగా రాజేశ్వరిని అప్పగించారు. పోలీసులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

గిరిజన నిరుద్యోగులకు ఊరట

- అభయమిచ్చిన హైకోర్టు
- జనరల్ డీఎస్సీపై కీలక పరిణామం
- ఏజెన్సీకి లోబడే నియామకాలు చేపట్టాలి
- కౌంటర్ దాఖలుకు ప్రభుత్వానికి ఆదేశం


హైకోర్టు ఎదుట ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ సభ్యులు

కెరమెరి(ఆసిఫాబాద్): జనరల్ డీఎస్సీలో గిరి జన ప్రాంత పోస్టుల ఊసే లేకుండా నోటిఫికేషన్ విడుదల చేసి ఉపాధ్యాయ పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేస్తున్న నేపథ్యంలో నాలుగు నెలల క్రితం హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై ఎట్టకేలకు కాస్త ఊరట లభించింది. హైకోర్టు న్యాయవాది మామిడి సాయియాదవ్ ఏజెన్సీ గిరిజన నిరుద్యోగుల పక్షాన పలు వాదనలు వినిపించిన అనంతరం హైకోర్టు శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేసింది. పరీక్షలు యధావిధిగా నిర్వహించవచ్చని, కానీ నియామకాల ప్రక్రియ మాత్రం తాము తీర్పు ఇచ్చే వరకు నిలిపివేయాలని, ఇందుకు సంబంధించి ఎనిమిది వారాల్లోపు కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో నిరుద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది. జనరల్ డీఎస్సీలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 6,459మంది గిరిజన నిరుద్యోగులు డీఎస్సీ పరీక్షలు రాయనున్నారు. కోర్టు ఆదేశాల ప్రకారం ఏజెన్సీ పోస్టులు గిరిజనులకే చెందితే అనేకమంది ఉద్యోగాలు సాధించే అవకాశం ఉంది.

5వ షెడ్యూల్ కీలకం..

ఏజెన్సీ(గిరిజన ప్రాంతంలో)లో చేపట్టే నియామకాలు గిరిజనులకే వర్తించాలని 5వ షెడ్యూల్ చెబుతోంది. ఎలాంటి నియామకాలు చేపట్టినా గిరిజన ప్రాంతానికే లోబడి ఉంటాయి. దీని ఆధారంగానే ఉమ్మడి రాష్ట్రంలో జీవో నంబరు 3 ప్రకారం ఏజెన్సీలో నియామకాలు చేపట్టారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత ప్రభుత్వం గిరిజన చట్టాలు, హక్కులను పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. గతంలో గిరిజన ప్రాంతంలోని ఉద్యోగ నియామకాలకు సంబంధించిన జీవో నంబర్ 3 కొట్టి వేస్తూ.. రిజర్వేషన్లు 50శాతానికి మించరాదని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఆ తర్వాత కూడా తెలంగాణ ప్రభుత్వం పోలీస్ కానిస్టేబుల్ నియామకాల్లో ఏజెన్సీలో 75శాతం రిజర్వేషన్ ఇచ్చింది. కానీ జనరల్ డీఎస్సీలో ఏజెన్సీ పోస్టులపై ఎలాంటి స్పష్టత లేకుండా నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో గిరిజన నిరుద్యోగులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఉద్యమాలు, ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ ఆధ్వర్యంలో పెందోర్ దీపక్ నేతృత్వంలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా కాస్త ఊరట ఇచ్చే విధంగా ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది.

చట్టం తేవాలి

జీవో 3 రద్దు వల్ల గిరిజన నిరుద్యోగులు తీవ్ర స్థాయిలో నష్టపోయే అవకాశం ఉంది. ఆదివాసీల సంస్కృతి, ఆచారాలు, యాస, భాష వేరుగా ఉండడం వల్ల రాజ్యాంగంలో 5వ షెడ్యూల్‌ను అమలు చేసింది. ప్రభుత్వాలు పరిగణనలోకి తీసుకోకపోవడంతో చట్టాలు నిర్వీర్యం అవుతున్నాయి. గిరిజనేతరులతో గిరిజనులు పోటీ పడి ఉద్యోగాలు సాధించడం అసంభవం. అందుకే ప్రత్యేక చట్టాలు, జీవోలు తీసుకొచ్చారు. కానీ ప్రభుత్వాలు ఈ విషయాన్ని మర్చిపోయి వ్యవహరిస్తున్నాయి. దేశంలోని గిరిజన ఎంపీలు ఏకమై చట్టసభల్లో ఏజెన్సీలోని ఉద్యోగాలు గిరిజనులకే వర్తించేలా ప్రత్యేక చట్టం తీసుకు రావాలని మేధావి వర్గాలు భావిస్తున్నాయి.

న్యాయం జరిగే వరకు ఆందోళనలు



గిరిజన నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం. మాకు చెందాల్సిన హక్కులు, చట్టాలు గిరిజనేతరుల చేతిలోకి పోతుంటే ఎలా ఊరుకుంటాం. మాకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయి. వాటిని రక్షించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. ఏజెన్సీలో నియామకాలు 100శాతం గిరిజనులతో పూరించే వరకు ఆందోళనలు కొనసాగిస్తాం. – పెందోర్ దీపక్, ఏజెన్సీ డీఎస్సీ హక్కుల సాధన కమిటీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు

నాలుగు ప్రైవేట్ బస్సులు సీజ్



సీజ్ చేసిన బస్సులతో అధికారులు

ఆదిలాబాద్‌రూరల్: మావల, ఆదిలాబాద్‌లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న నాలుగు ప్రైవేట్ బస్సులను శనివారం సీజ్ చేసినట్లు డీటీవో శివపల్లి శ్రీనివాస్ తెలిపారు. ప్రయాణికులను డ్రైవర్ కేబిన్‌లో కూర్చుబెట్టుకోని తరలిస్తున్నారన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన బస్సులను సీజ్ చేశామన్నారు. ఏఎంవీఐ హరింద్ర కుమార్, హోంగార్డు కలీం, తదితరులు ఉన్నారు.

స్వర్ణకారుల ఆందోళన


ఆందోళనలో స్వర్ణకారులు

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని ప్రైవేటు ఫైనాన్స్ కార్యాలయం ఎదుట స్వర్ణకారులు శనివారం ఆందోళన చేపట్టారు. సుర్జాపూర్ ఆటో అడ్డాలో గోల్డ్ షాపు యజమాని పెందోట కుమార్ వద్ద ఓ వ్యక్తి బంగారం కొనుగోలు చేశాడు. బంగారంపై రుణం కోసం ఫైనాన్స్ కంపెనీకి వెళ్తే నకిలీదని నిర్వాహకులు చెప్పాడు. సదరు బాధితుడు గోల్డ్‌షాపు వద్ద ఆందోళనకు దిగాడు. పెందోట కుమార్ స్వర్ణకార సంఘం నాయకులతో కలిసి ఫైనాన్స్ కార్యాలయానికి వెళ్లి ఆందోళన చేపట్టి నిర్వాహకులను నిలదీశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. సంఘం పట్టణ అధ్యక్షుడు కడార్ల వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి బిక్కునూరి రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

చిరుతపులి దాడిలో మేకపోతు మృతి


మృతి చెందిన మేకపోతు

తలమడుగు: మండలంలోని కొత్తూరు శివారులో చిరుతపులి దాడిలో మేకపోతు మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాలు.. బాతురి మల్లేశ్ మేకల మందను శనివారం మేత కోసం అటవీ ప్రాంతానికి తీసుకెళ్లాడు. చిరుత పులి దాడి చేసి హతమార్చింది. దీని విలువ రూ.10 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. కాగా, గత 15 రోజుల క్రితం మేకల మందపై దాడి చేయగా కాపరుల అరుపులతో విడిచిపెట్టి వెళ్లింది.

లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు

ముధోల్: వివాహితపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ముధోల్ సీఐ మల్లేశ్, ఎస్సై సాయికిరణ్ తెలిపారు. వారి కథనం ప్రకారం.. తానూరు మండలం కర్బాల గ్రామానికి చెందిన సాయినాథ్ అదేగ్రామానికి చెందిన వివాహితను మాయమాటలు చెప్పి శుక్రవారం ముధోల్‌లోని జలాల్‌సాబ్ చెరువు సమీపాన తీసుకువచ్చి లైంగికదాడికి పాల్పడ్డాడు. శనివారం వివాహిత భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ, ఎస్సై తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత


పట్టుకున్న బియ్యం వాహనంతో సీఐ సాయినాథ్

బేల: మండలకేంద్రంలోని జాతీయ రహదారి మార్గంలో పాత పెట్రోల్ పంపు వద్ద 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు జైనథ్ సర్కిల్ సీఐ సాయినాథ్ తెలిపారు. శనివారం సాయంత్రం ఏఎస్సై జీవన్‌కుమార్, సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా బేలకు చెందిన షేక్ షేబాజ్ బొలెరో వాహనంలో 20 క్వింటాళ్ల బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. విచారణలో బేలకు చెందిన వాసింతో కలిసి గ్రామాల్లో బియ్యాన్ని సేకరించి, మహారాష్ట్రలోని బోరి గ్రామానికి చెందిన జావిద్‌కు అమ్మడానికి తీసుకెళ్తున్నట్లు గుర్తించామన్నారు. వీరిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో ఏఎస్సై లింగన్న, హెడ్‌కానిస్టేబుల్ గిరి, కానిస్టేబుళ్లు రమేశ్, విఠల్ పాల్గొన్నారు.

జైనథ్: ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్రకు మూడు ఆటోలో తరలిస్తున్న 16.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు సీజ్ చేశారు. శనివారం 44వ నంబర్ జాతీయ రహదారిపై కామాయి ఎక్స్ రోడ్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఆటోల్లో బియ్యం పట్టుబడ్డాయి. ఆదిలాబాద్‌కు చెందిన మహ్మద్ సాబిర్, ఫైజాన్, జావిద్‌లు బంగారిగూడకు చెందిన రఫీక్, శౌకత్ నుంచి బియ్యాన్ని తీసుకొని మహారాష్ట్ర బోరిలోని జావిద్‌కు అమ్మేందుకు తీసుకెళ్తున్నారు. అక్రమంగా తరలిస్తున్న బియ్యం, ఆటోలు ఎస్సై పురుషోత్తం సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ సాయినాథ్ పేర్కొన్నారు.

పిడుగుపాటుకు 12 మేకలు మృత్యువాత


మృతిచెందిన మేకలు

తాంసి: తాంసి శివారు బోడగుట్ట ప్రాంతంలో పిడుగుపాటుకు 12 మేకలు మృత్యువాతపడ్డాయి. శనివారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షానికి పిడుగుపడింది. ఆ సమయంలో మేతకు వెళ్లిన మేకలు మృతి చెందగా మరికొన్ని తీవ్రంగా గాయపడ్డాయి. మేకల కాపరి కిష్టుకు చెందిన 10, రాములుకు చెందిన 2 మేకలు మృత్యువాత పడ్డాయి. వీటి విలువ రూ.లక్షకు పైగా ఉంటుందని బాధితులు తెలిపారు.